క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న పెద్దిశెట్టి శంకర ప్రసాద్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌లోని బీరంగూడకు చెందిన పెద్దిశెట్టి శంకర ప్రసాద్ దంపతులు బుధవారం రూ.55,558 విరాళంగా అందజేశారు. ఆలయాధికారులు ఈ సొమ్మును స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

తైలాభిషేకానికి విరాళం



ఈఓ బాపిరెడ్డికి విరాళం అందజేస్తున్న చెరుకూరి కృష్ణమూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామి తైలాభిషేకం కోసం శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు సమీపంలో ఉన్న విష్ణు బేరియం ప్రైవేటు లిమిటెడ్ ఎండీ చెరుకూరి కృష్ణమూర్తి బుధవారం రూ.1,09,500 చెక్కు రూపంలో ఈఓ బాపిరెడ్డికి అందజేశారు. ఆయన దాతలకు కృతజ్ఞతలు తెలిపి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కుంగిన కల్వర్టు



సత్యవేడు మార్గంలోని కోనాక్షమ్మ ఆలయ సమీపంలో కుంగిన కల్వర్టు

వరదయ్యపాళెం: సత్యవేడు–చిన్నపాండూరు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలోని కోనాక్షమ్మ ఆలయ సమీపంలో కల్వర్టు కుంగి గుంత ఏర్పడింది. ఇక్కడ రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో వాహనదారులు ఈ గుంత ఉన్న విషయం తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కుంగిన కల్వర్టును బాగు చేయాలని అటువైపుగా వెళ్లే వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


ఏర్పేడులో జడివాన

ఏర్పేడు: మండలకేంద్రంలో బుధవారం సాయంత్రం గాలులతో కూడిన జడివాన కురిసింది. అర్ధగంటకు పైగా భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది.

5న ఏర్పేడు మండల మీట్

ఏర్పేడు: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ గీత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమావేశానికి ఆయా శాఖల వారిగా పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన



మాట్లాడుతున్న విశాలాక్షి

రేణిగుంట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీడీపీఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు రుతు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం తేజో భారత్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కోలా విశాలాక్షి ఆధ్వర్యంలో రుతు సమయంలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచురించిన పుస్తకాలను కార్యకర్తలకు పంపిణీ చేశారు. పీడీ కార్యాలయ సిబ్బంది వసంతి, నోడల్ ఆఫీసర్ సబీరన్, సూపర్‌వైజర్లు హేమావతి, అనంతలక్ష్మి, అనంతవాణి, భారతి, తేజో భారత్ స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సత్యవేడు: మండలంలోని మదనంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం టి.విమల ఆధ్వర్యంలో బదిలీ అయిన టీచర్లను సన్మానించారు. ఉపాధ్యాయులు చిన్నబాబు, గోపి, నాగరాజ్, సుబ్రమణ్యం, స్వర్ణ, దయను సహచర ఉపాధ్యాయులు సన్మానించారు.

చక్రబంధం

జయరామరావువీధి..

శ్రీకాళహస్తి పట్టణంలో ప్రధాన రహదారుల్లో ఒకటి. ఈ మార్గంలో వెళ్లాంటే వాహనచోదకుల సహనానికి పరీక్షే. ఉదయం, సాయంత్రం నత్తనడకన సాగే వాహనాలు, ముక్కంటి ఆలయ పరిసరాల్లో ఎక్కడపడి అక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్‌తో అమ్మో శ్రీకాళహస్తా అనేలా చేస్తోంది. పట్టణంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీ కారణంగా వాహనాలు నెమ్మదిగా సాగుతోంటే శ్రీకాళహస్తి వాహన సంద్రాన్ని తలపిస్తోంది.

- ముక్కంటి భక్తులకు ట్రాఫిక్ ఇక్కట్లు
- బ్యాంకులన్నీ ఒకే చోటతో రద్దీ

జయరామరావు వీధిలో స్తంభించిన ట్రాఫిక్



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు పడుతున్నారు. తమిళనాడు నుంచి వచ్చే భక్తులు ఎక్కువగా వారి సొంత వాహనాల్లో వస్తున్నారు. వారు పట్టణంలోని శివం సర్కిల్ నుంచి జయరామరావు వీధి మీదుగా పట్టణంలోకి ప్రవేశిస్తారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. పూర్ణం బేకరీ నుంచి కుమారస్వామి తిప్ప, పెద్ద మసీదు మీదుగా వచ్చే వాహనాలు జయరామరావువీధిలో కలుస్తున్నాయి. ఈ ప్రాంతంలోనే బ్యాంకులన్నీ కేంద్రీకృతం కావడంతో ఈ రోడ్డు రద్దీగా మారుతోంది. ఈ ప్రాంతంలో ఉన్న కొందరు వ్యాపారులకు సరుకులు తెచ్చే పెద్ద వాహనాలు ఏ సమయంలో పడితే ఆ సమయంలో పట్టణంలోకి ఈ ప్రాంతం నుంచి ప్రవేశిస్తున్నాయి. దానికితోడు ఇరుకు రోడ్డు కావడంతో ఈ ప్రాంతమంతా రద్దీగా మారి, ట్రాఫిక్ స్తంభించిపోతోంది.





ఆలయం వద్ద స్వర్ణముఖి నది బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనాలు, బజారు వీధిలో భారీ వాహనాలు రావడంతో ట్రాఫిక్ ఇక్కట్లు

ఆలయం వద్ద భక్తుల ఇక్కట్లు

శని, ఆది, సోమవారాల్లో ఆలయం వద్ద ట్రాఫిక్ ఇక్కట్లు భక్తులకు తప్పడం లేదు. ప్రధానంగా సన్నిధి వీధి, పొన్నాలమ్మ గుడి, భిక్షాలగోపురంలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం, ఒక్క వాహనం ఆగితే వెనుక స్వల్ప వ్యవధిలోనే పదుల సంఖ్యలో వాహనాలు ఆగిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీన్ని క్రమబద్ధీకరణకు అవసరమైన మేరకు ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. భారీ వాహనాలను పట్టణంలోకి ప్రవేశించకుండా గట్టి చర్యలు తీసుకుని, వన్‌వే ట్రాఫిక్‌ను పక్కాగా అమలు చేస్తూ, గత ప్రభుత్వంలో ప్రారంభమైన శివం టు శివం రోడ్డు నత్తనడకన సాగుతోందని, దీన్ని వేగవంతం చేసి, పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య నియంత్రించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

చికిత్స పొందుతూ మృతి

నాగలాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు.. స్థానిక భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద మంగళవారం తమిళనాడులోని రెడ్‌హిల్స్‌కు చెందిన విజయ్ కుమార్ (62) ద్విచక్రవాహనంలో కేవీబీ పురం నుంచి చెన్నైకి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుణ్ని స్థానికులు చికిత్స నిమిత్తం నగరి ఆస్పత్రికి తరలించారు. అయితే బుధవారం అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. చెన్నై ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి, అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని, మృతుడి కొడుకు మణికంఠన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరు బ్యాంకు మేనేజర్ల నియామకం



సూర్యప్రకాష్, చిరంజీవి

సత్యవేడు: స్థానిక సత్యవేడు స్టేట్ బ్యాంకు మేనేజర్‌గా సూర్యప్రకాష్, రాళ్లకుప్పం స్టేట్ బ్యాంకు మేనేజర్‌గా చిరంజీవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాదు నుంచి బదిలీపై సూర్యప్రకాష్ సత్యవేడు స్టేట్ బ్యాంకుకు వచ్చారు. శ్రీకాళహస్తి నుంచి బదిలీపై చిరంజీవి రాళ్లకుప్పం స్టేట్ బ్యాంకుకు వచ్చారు. ఈసందర్భంగా సత్యవేడు బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంకు ప్రస్తుతం రూ.187 కోట్లు టర్నోవర్‌లో ఉందన్నారు. ఇందులో రూ.120 కోట్ల రుణాలు, రూ.60 కోట్లు డిపాజిట్లు ఉన్నట్లు మేనేజర్ తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా ఏటీఎం మిషన్లు నగదు ఉండేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు.

హద్దులు దాటితే చర్యలు



రోడ్డుపై పెట్టిన దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: దుకాణదారులు తమ హద్దులు దాటి రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేసుకుంటుంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు అన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డుపైకి వచ్చి అమ్మకాలు సాగిస్తున్న దుకాణదారులను వారు హెచ్చరించారు. రోడ్డుపై నుంచి తొలిగించారు. ఎవరైనా తమ పరిధికి మించి రోడ్డులోకి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనచోదకులకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలన్నారు. లేదంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

అనధికారికంగా ప్రైస్, పోలీసు స్టిక్కర్లు ఉంటే జరిమానా

అనధికారికంగా ప్రైస్, పోలీసు స్టిక్కర్ల తమ వాహనాలకు వేసుకుని తిరుగుతుంటే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. బుధవారం అనధికారికంగా ప్రైస్, పోలీసు స్టిక్కర్లను వేసుకుని వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారితో వాటిని తొలగించారు. పోలీసులు మాట్లాడుతూ ఇకపై ఎవరైనా ఇలా స్టిక్కర్లను అనధికారికంగా వేసుకుంటే జరిమానాలు విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలని తెలిపారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న కత్తి రవి

శ్రీకాళహస్తి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి రవి డిమాండ్ చేశారు. పట్టణంలోని రామసేతు వంతెన వద్ద భవన నిర్మాణ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 46 క్లెయిములకు నిధులను మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వం మళ్లించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున్, భవన నిర్మాన కార్మిక సంఘం నాయకులు నారాయణ, బాబు, రవికుమార్, విజయకుమార్, కార్మికులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో నెలకొన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామానాయుడు డిమాండ్ చేశారు. బుధవారం శ్రీకాళహస్తి మండలం రెడ్డిపల్లిలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని, సబ్సిడీ యంత్ర పరికరాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సబ్సిడీ విత్తనాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, రూరల్ మండల కార్యదర్శి మంచల శివకుమార్, సీపీఐ ఏర్పేడు నాయకులు రమేష్, రైతు సంఘం నాయకులు మల్లీశ్వరయ్య, వెంకటయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పాము హల్‌చల్



సర్పాన్ని కొట్టి చంపేస్తున్న స్థానికులు

నాగలాపురం: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ వద్ద ఓ విష సర్పం హల్‌చల్ చేసింది. సన్నిధి వీధిలో కాలి నడకన వెళ్తున్న ప్రజలు పామును చూసి భయపడ్డారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది సైతం ఆ విషపూరిత పామును చూసి మిన్నకుండిపోయారు. అయితే స్థానికులు దాన్ని కొట్టి చంపేశారు.

మద్యం షాపులో యువకుల మధ్య గొడవ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్

రేణిగుంట: మద్యం షాపులో మంగళవారం రాత్రి మద్యం సేవిస్తూ ఇద్దరు యువకులు గొడవపడిన సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇద్దరూ బుధవారం వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. రేణిగుంట పాత విమానాశ్రయ రహదారిలో గోడౌన్ సమీపంలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం సేవిస్తున్న లక్ష్మీపురానికి చెందిన విక్రమ్, రామకృష్ణాపురానికి చెందిన రాకేష్ మధ్య మంగళవారం రాత్రి వివాదం జరిగింది. ఈ గొడవలో విక్రమ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడ నుంచి ఇంటికి వెళుతున్న రాకేష్‌పై రామకృష్ణాపురం రోడ్డులో విక్రమ్ తన మనుషులతో కలిసి దాడి చేయడంతో రాకేష్‌కు తలపై తీవ్ర గాయం అయ్యింది. రాకేష్‌ను స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విక్రమ్ తిరుపతి రుయా హాస్పిటల్‌లో చికిత్స తీసుకొని ఇంటికి చేరుకున్నారు. ఈ సంఘటన రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరగడంతో గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో విక్రమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారిస్తున్నారు. అలాగే రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అంకయ్య



అంకయ్యను సన్మానిస్తున్న కామి వెంకటేశ్వర్లు

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ గ్రీవెన్‌సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన బావులూరు అంకయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఉపాధ్యక్షుడు కామి వెంకటేశ్వర్లు బుధవారం ఆయన్ని కలిసి ఘనంగా సత్కరించారు. మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, కేవీబీపురం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డేవిడ్, బీసీ నాయకులు విజయకుమార్‌రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

వైభవంగా పరాశరేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం జరుపుతున్న వేదపండితులు

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం సాయంత్రం స్వామి, అమ్మవారి ఆర్జిత కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామివారు అశ్వవాహనాన్ని అధిరోహించి పుర వీధుల్లో విహరిస్తూ కర్పూర హారతులు అందుకున్నారు. ఉదయం నిత్యపూజా కార్యక్రమాలను, పరివార దేవతలకు అభిషేకాలు, నిర్మిత హోమశాలలో హోమాలు చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు వితరణ చేశారు. సాయంత్రం 8 గంటలకు అయ్యప్ప భజన మందిరంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామికి శైవాగమ శాస్త్రోక్తంగా ఆర్జిత కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలను, వస్త్ర బహుమానం అందజేశారు. కార్యక్రమాలను స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం రావణేశ్వర వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జయలక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో జయలక్ష్మి అనే మహిళ మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అలాగే బూడిదమిట్టలోని మద్దిన బాలాజీ తండ్రి జయరామయ్య కర్మక్రియలకు హాజరై, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, మస్తాన్, చిన్నబ్బ, సురేష్, మున్నారాయల్, కంఠా ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాజసూయయాగం



శ్రీకాళహస్తి: పట్టణంలోని చెన్నైరోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాజసూయయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారికి అభిషేక పూజలు చేశారు. ఆలయంలో యాగపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను చప్పరాలపై కొలువు దీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

పరంధామరెడ్డి మృతి బాధాకరం



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని మండలంలోని నాగనందాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పరంధామరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రా జేష్ తెలిపారు. బుధవారం నాగనందాపురంలో జరిగిన పరంధామరెడ్డి దశదిన కర్మక్రియల్లో ఆయ న పాల్గొని పరంధామరెడ్డి చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు నాయుడు దయాకర్ రెడ్డి (వరదయ్యపాళెం), మణి నాయుడు (బీఎన్‌కండ్రిగ), సుశీల్ కుమార్ రెడ్డి (సత్యవేడు), సింగిల్‌విండో మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మహేంద్ర, యూత్ అధ్యక్షుడు వినోద్ యాదవ్, ప్రచార కమిటీ అధ్యక్షుడు శివాయాదవ్, సోషల్ మీడియా కో–కన్వీనర్ శోభన్ యాదవ్, నాయకులు బెల్లు రమేష్, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్యామ్‌ప్రసాద్ ఉన్నారు.

పరామర్శ..

బీఎన్‌కండ్రిగ మండలం కుక్కంబాకం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వెంకటేష్ తండ్రి ఇటీవల పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న విషయం తెలిసి నూకతోటి రాజేష్ మండల శ్రేణులతో పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు మణి నాయుడు, పార్టీ నాయకులు సాయినాయుడు, గోపాల్ రెడ్డి, ప్రసాద్ పాల్, గురవయ్య, మనోహర్, పరంధామయ్య, అమరలింగయ్య ఉన్నారు.

డ్రోన్‌తో క్రిమిసంహారక మందు పిచికారీ



క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న డ్రోన్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రానికి చెందిన రైతు నాగేశ్వర నాయుడు బుధవారం తాను సాగు చేసిన వరి పంటకు డ్రోన్‌తో క్రిమిసంహారక మందు పిచికారీ చేయించారు. మండలంలో మొదటగా డ్రోన్‌తో క్రిమిసంహారక మందును పిచికారి చేయడంతో సమీప రైతులు సైతం ఈ విధానాన్ని పరిశీలించారు. సబ్సిడీపై ప్రభుత్వం ద్వారా డ్రోన్ పొందిన రైతులు ఎకరాకు రూ.400 అద్దెతో క్రిమిసంహారక మందును పిచికారి చేయనున్నట్లు వారు తెలిపారు. డ్రోన్ ద్వారా ఎకరం వరి పంటకు 5 నిమిషాల వ్యవధిలో పిచికారి చేస్తున్నట్లు వారు తెలిపారు.

మృతుని కుటుంబానికి సిపాయి భరోసా



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: మృతుడు సోమయ్య కుటుంబానికి సిపాయి భరోసా పథకం కింద నిత్యావసరకులు అందజేశారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సోమయ్య ఇటీవల మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం బుధవారం గ్రామానికి చేరుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వారికి సిపాయి భరోసా నుంచి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్నంరెడ్డి, బాలాజీరెడ్డి, భరత్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

నిరసన వినూత్నం



నుదుట నామం...చెవిలో పువ్వుతో నిరసన వ్యక్తం చేస్తున్న స్విమ్స్ కార్మికులు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణం కార్మికుల నిరసనలతో హోరెత్తుతోంది. కార్మికులు వేతనాలు పెంచాలని, హోదాను మార్చాలని చేస్తున్న ఆందోళన రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. బుధవారం గంట పాటు విధులు బహిష్కరించిన కార్మికులు నుదుట నామాలు.... చెవిలో పువ్వులతో..తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి గోవిందా! అంటూ నినదించారు.